




రేపు పాలస్తీనాకు సంఘీభావ సదస్సు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

గాజాపై ఇజ్రాయెల్ ఆటవిక దాడులు, యుద్ధాన్ని ఆపాలని, కాల్పుల విరమణ జరిపి ఘర్షణలకు స్వస్తి పలకాలని కోరుతూ వామపక్ష పార్టీల పిలుపు మేరకు అక్టోబర్ 7న సోమవారం సంఘీభావ దినంగా పాటిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రంలో ఉదయం 10 గంటలకు సభ జరుగుతుందన్నారు. పాలస్తీనాకు సంఘీభావంగా జరిగే ఈ సదస్సును జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.



వకుళమాత వంటశాల ప్రారంభించిన చంద్రబాబు


టిటిడి అధికారులతో చంద్రబాబు సమీక్ష

తిరుమలలో విఐపి సంస్కృతి తగ్గాలి

టిటిడి అధికారుల సమీక్షలో చంద్రబాబు

ప్రజాశక్తి - తిరుమల

తిరుమల పవిత్రత, నమ్మకం కాపాడేలా ప్రతి ఒక్కరూ పనిచేయాలని, కొండపై గోవింద నామస్మరణ తప్ప, మరోమాట వినిపించకూడదని, విఐపి సంస్కృతి తగ్గాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సూచించారు. పద్మావతి అతిథిగృహంలో ముఖ్యమంత్రి టిటిడి అధికారులతో శనివారం సమీక్షించారు. చంద్రబాబు మాట్లాడుతూ తిరుమలలో ప్రశంతతకు ఎక్కడా భంగం కలగకూడదని, ఏ విషయంలోనూ రాజీపడొద్దని అన్నారు. భక్తుల సూచనలు, సలహాల ఆధారంగా సేవలపై టిటిడి పనిచేయాలన్నారు. అన్ని దేవాలయాల్లోనూ భక్తుల అభిప్రాయాలను తీసుకునే విధానాన్ని తీసుకురావాలన్నారు. లడ్డూ ప్రసాదం, అన్నప్రసాదం నాణ్యత ఎల్లపుడూ కొనసాగాలన్నారు. తిరుమల పేరు తలిస్తే ఏడుకొండలవాని వైభవం, ఆధ్యాత్మికత మాత్రమే చర్చకు రావాలన్నారు. స్విమ్స్ సేవలు మెరుగుపడాలన్నారు. భవిష్యత్ నీటి అవసరాలకు తగినట్లు ముందస్తు ప్రణాళిక అవసరం అన్నారు. అటవీ ప్రాంతాన్ని 72 నుంచి 80శాతం పైగా పెంచాలని సూచించారు.

కేంద్రీకృత వకుళమాత వంటశాల ప్రారంభం


తిరుమలలో కేంద్రీకృత వకుళమాత వంటశాలను సిఎం చంద్రబాబు ప్రారంభించారు. 1.2 లక్షల మంది భక్తులకు అన్నప్రసాదం అందించే వీలుగా ఈ వంటశాలను ఏర్పాటు చేశారు. తిరుమల పాంచజన్యం విశ్రాంతి భవనం వెనుక వైపున ఔటర్ రింగ్‌రోడ్డు పక్కన అధునాతనమైన వంటశాలను రూ.13.45 కోట్ల వ్యయంతో నిర్మించారు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో వంట, ఆహారధాన్యాలు, కూరగాయలు, పాలు, మొదటి అంతస్తులో ఆహార తయారీ, ఆవిరి ఆధారిత బాయిలర్లు, ఎగ్జాస్ట్ పద్ధతిలో ఏర్పాటు చేశారు. దేవాదాయ శాఖ మంత్రి రామనారాయణ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే శ్రీనివాసులు, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవోలు, గౌతమి, వీరబ్రహ్మం, సివిఎస్వో శ్రీధర్, సిఈ సత్యనారాయణ, డెప్యూటీ ఈవో అన్నప్రసాదం రాజేంద్ర, ప్రత్యేక క్యాటరింగ్ అధికారి జీఎల్ఎన్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

సిఎంకు సాదర వీడ్కోలు

ప్రజాశక్తి - రేణిగుంట

తిరుమల శ్రీవారి వార్షిక సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో రాష్ట్ర ప్రభుత్వం తరపున శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించి, వకుళమాత కొత్త సెంట్రల్ కిచెన్ సెంటర్ ప్రారంభోత్సవాల్లో పాల్గొన్న సిఎం చంద్రబాబునాయుడు తన రెండు రోజుల తిరుపతి జిల్లా పర్యటన ముగించుకుని రేణిగుంట విమానాశ్రయం నుంచి ఉదయం 11.53 గంటలకు తిరుగు ప్రయాణమయ్యారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్‌నాయుడు, అనంతపురం రేంజి డిఐజి షిమోషి బాచ్‌పాయ్, కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, ఎస్‌పి సుబ్బరాయుడు, జెసి శుభం బన్సల్, కమిషనర్ ఎన్.మౌర్య, ఎంఎల్ఎలు భానుప్రకాష్, థామస్, ఆరణి శ్రీనివాసులు, అమరనాథ్‌రెడ్డి, మురళీమోహన్, బొజ్జల సుధీర్‌రెడ్డి, మాజీ ఎంఎల్ఎ సుగుణమ్మ, వరప్రసాద్ పాల్గొన్నారు.

అభిమాని కోర్కె తీర్చిన చంద్రబాబు




పుట్టుకతోనే ప్రత్యేక ప్రతిభావంతుడిగా జన్మించిన అతడికి అధినేత అంటే ప్రాణం.... అతనితో ఫోటో దిగాలని కోరిక నేటికి తీరింది... రేణిగుంట పట్టణానికి చెందిన ప్రసాద్ బాబు రోజా రాణి దంపతుల చిన్న కుమారుడు సురేంద్రబాబు పుట్టుకతోనే బుద్ధిమాంద్యంతో జన్మించాడు. ఇటీవల క్యాన్సర్ బారిన పడి తీవ్ర అనారోగ్యానికి గురై మంచానికే పరిమితమయ్యాడు.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో ఒక ఫోటో తీసుకోవాలన్న కోరిక కలగానే మిగిలిపోతుందని ఆవేదన వ్యక్తం చేయడంతో కుటుంబ సభ్యులు స్థానిక పట్టణ నాయకులు సహాయంతో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో శనివారం ఉదయం స్థానిక నాయకులు సురేంద్రబాబును, అతని కుటుంబ సభ్యులను తీసుకొని గ్యాలరీ వద్దకు చేరుకున్నారు. నేరుగా చంద్రబాబు నాయుడు వచ్చి వీల్ చైర్ కే పరిమితమైన సురేంద్రబాబుతో కలిసి ఫోటో దిగడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయింది. అదేవిధంగా అభిమాని చికిత్స కోసం అప్పటికప్పుడే ఐదు లక్షలు చెక్కును అందజేశారు.

వితంతువుకు రూ.50వేల ఆర్థిక సాయం

ప్రమాదంలో భర్తను కోల్పోయిన మహిళ కుటుంబానికి ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు 50 వేల రూపాయల ఆర్థిక సాయం చెక్కును కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ అందజేశారు. విమానాశ్రయం వెలుపల అర్జీదారు కె.సుబ్బరత్నమ్మ ఎంఎల్‌ఎను కలిసి తన భర్త కె.ప్రసాద్ గత ఏడాది ఏప్రిల్‌లో యాక్సిడెంట్‌లో చనిపోయారని, ఆర్థికంగా చితికిపోయానని, ఇద్దరి పిల్లల్లో ఒకరి ఆరోగ్యం సరిగ్గా లేదని వాపోయారు. చలించిన సిఎం వారి కుటుంబానికి సత్వర సాయంగా రూ.50వేల చెక్కును ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశించారు.

చంద్రబాబుకు రాజుయాదవ్ సత్కారం

తిరుమల శ్రీవారికి బ్రహ్మోత్సవాల సందర్భంగా పట్టు వస్త్రాలు సమర్పించడానికి వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని ఘనంగా సత్కరించారు. తిరుమల టిడిపి ప్రెసిడెంట్ సుద్దాల రాజుయాదవ్ ఆధ్వర్యంలో శ్రీవారి చిత్రపటం బహూకరించారు. తిరుమలకు సంబంధించిన సమస్యల మీద వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, పార్లమెంట్ అధ్యక్షులు నరసింహ యాదవ్, రాష్ట్ర టిడిపి అధికార ప్రతినిధి కోడూరు బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.



ఏచూరి బాటలో నడుద్దాం

సంస్మరణ సభలో వక్తలు



ప్రజాశక్తి - నాయుడుపేట

'సీతారాం ఏచూరి బాటలో నడవడమే ఏచూరికి అసలైన నివాళి' అని వక్తలు ఉద్ఘాటించారు. నాయుడుపేట అంబేద్కర్ బొమ్మ నుంచి సిఐటియు ఆఫీసు వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వేదనపత్తి సుందర్ రామిరెడ్డి భవన్‌లో సిఐటియు కార్యాలయంలో సీతారాం ఏచూరి సంస్మరణ సభ జరిగింది. నేతలు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ సీతారాం ఏచూరి జీవితం ఆదర్శప్రాయం అని, ఆయన విద్యార్థి దశలో దేశంలోనే మొదటి స్థానం సంపాదించి తన కోసం కాకుండా దేశం కోసం, దేశ ప్రజల కోసం తన వ్యక్తిగత జీవితాన్ని త్యాగం చేసి, కమ్యూనిస్టు పార్టీలో చేరి పేద బడుగు వర్గాల అభ్యున్నతికి కృషి చేశారన్నారు. ఒక తెలుగువాడైయుండి జాతీయ స్థాయిలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో కమ్యూనిస్టులకు వన్నెతెచ్చాడని, ఆయన నడవడిక ప్రతి ఒక్క కమ్యూనిస్టుకి ఆదర్శప్రాయమని, ఆయన గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుందని ఆయన సేవలను కొనియాడారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య మాట్లాడుతూ అమెరికా ప్రెసిడెంట్, భారత ప్రధానమంత్రి ఇందిరాగాంధీ లాంటి వారితో విభేదించి పోరాడిన వ్యక్తి అని, అద్వానీ లాంటివారు సీతారాం ఏచూరి ప్రసంగాలను వింటుండే వాన్ని అని స్వయంగా తెలియజేశారని, చివరి దశలో తన శరీరాన్ని వైద్య పరిశోధనల కోసం ఇచ్చిన మహనీయుడు అని కొనియాడారు. టిడిపి సీనియర్ నేత శరసనంభేటీ, విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ కమ్యూనిస్టులు అట్టడుగు వర్గాల తరపున పోరాడుతున్నారని, వారి పోరాటాలు రాజకీయాలకు అతీతంగా తన మద్దతు ఎప్పుడూ ఉంటుందని, అయితే ఈ పోరాటాలు శాంతియుతంగా నిర్వహించాలని సూచించారు. పాలకపక్షం సరిగా పని చేయాలంటే సరియైన ప్రతిపక్షం ఉండాలని, అప్పుడే బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. ఒక నిజాయితీ గల ప్రతిపక్షం అంటే అధికార పక్ష నాయకులు ఏది చేసిన తప్పు పట్టకుండా వారు చేస్తున్న పాలనలో పేదవారికి మేలు చేసే వాటిని సూచిస్తూ ఇబ్బందికరమైన వాటిని వ్యతిరేకిస్తూ శాంతియుతమైన పోరాటాలు కొనసాగించాలని ఆశించారు. భావి భారత నిర్మాణంలో కమ్యూనిస్టులు పెద్దన్న పాత్ర పోషించారని, పుచ్చలపల్లి సుందరయ్య, సీతారాం ఏచూరి లాంటి మహనీయులు ఎందరో తమ పోరాటాలతో స్ఫూర్తినింపారని కొనియాడారు. ప్రస్తుత పరిస్థితులకు తగ్గట్లుగా కమ్యూనిస్టులు తమ పంథా మరింత మెరుగుపరచుకొని బలమైన ప్రతిపక్షంగా రూపుదిద్దుకోవాలని ఆకాంక్షించారు. డాక్టర్ వై.రామసుబ్బయ్య మాట్లాడుతూ పేద బలహీన వర్గాల ప్రజలు ప్రశాంతంగా ఉన్నారంటే కమ్యూనిస్టు పార్టీలో సీతారాం ఏచూరి లాంటి త్యాగాలు చేసిన మహనీయులు ఉన్నారని అన్నారు. సిఐటియు జిల్లా నాయకులు లక్ష్మి, సుధాకర్, యుటిఎఫ్ నాయకులు రాజశేఖర్ రెడ్డి, సుబ్బారావు, అంగన్వాడి శ్యామలమ్మ, ఆశ సుజాత, మధ్యాహ్న భోజన కార్మికురాలు విజయమ్మ, గిరిజన సంఘం సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు ఎస్ మహేష్ బాబు, శివకవి ముకుంద పాల్గొన్నారు.



ఏచూరికి నేతల నివాళి

లెప్రసీ, టీబీపై వైద్యాధికారులకు శిక్షణ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో వైద్యాధికారులకు లెప్రసి, టిబి వ్యాధులపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ యు.శ్రీహరి ఆధ్వర్యంలో ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శరీరం పై స్పర్శ లేని మచ్చలు, పొడలు లావుగా మారిన నొప్పి తో కూడిన నరాలు, బొడిపలు నొప్పి లేని పుండ్లు చెవి తమ్మెలు మందంగా మారి ఉండడం, ముఖం పై నూనె రాసి నట్లు జిడ్డు గా ఉండడం మొదలైన లక్షణాలు ఉన్నట్లయితే కుష్ఠు వ్యాధి లక్షణాలుగా అనుమానించాలని, వ్యాధి నిర్ధారణ కొరకు దగ్గర లోని ప్రభుత్వ ఆసుపత్రి లో వైద్యులను సంప్రదించాలని తెలిపారు. కుష్ఠు వ్యాధి గా నిర్ధారణ జరిగితే, ఖరీదయిన మందులు, శస్త్ర చికిత్సలు ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. కుష్ఠు వ్యాధి గ్రస్థులకు ఉచితంగా ఎంసీర్ చెప్పులు పంపిణి చేస్తామన్నారు. రెండు వారాలకు మించి దగ్గు,



ఆకలి లేక పోవడం, బరువు తగ్గడం, దగ్గి నపుడు గళ్ళ లో రక్తం పడడం, ఛాతి నొప్పి మొదలైన లక్షణాలు క్షయ వ్యాధి లక్షణాలుగా భావించాలని, గళ్ళ పరీక్ష ద్వారా క్షయ వ్యాధి నిర్ధారించబడుతుంది అని తెలిపారు. డాట్స్ చికిత్స తో క్షయ వ్యాధి నయమవుతుంది అని తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో వైద్యాధికారుల శిక్షణకు ముందు, శిక్షణ తరువాత పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కుష్టు ఎయిడ్స్, క్షయ నివారణ అధికారి డాక్టర్ శ్రీనివాసుల రెడ్డి, డబ్ల్యూహెచ్ఓ కన్సల్టంట్‌డాక్టర్ సమంతా గ్రేస్ పాల్గొన్నారు.

చెరువుల్లో 'మెగా' అక్రమ తవ్వకాలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

తొట్టంబేడు-పెళ్లకూరు మండలాల సరిహద్దుల్లోని చెరువుల్లో మెగా అక్రమ తవ్వకాలు మొదలయ్యాయి. పెళ్ళకూరు మండలంలోని నెలబల్లి చెరువు, తొట్టంబేడు మండలంలోని లింగమనాయుడుపల్లి చెరువుల్లో వారం రోజులుగా భారీ హిటాచీలు పెట్టి పగలూ రాత్రి తేడా లేకుండా తవ్వకాలు చేస్తున్నారు. ఆ మట్టిని భారీ టిప్పర్ల సాయంతో మదనపల్లి-నాయుడు పేట జాతీయ రహదారి విస్తరణ పనుల నిమిత్తం తరలిస్తున్నారు. భారీ టిప్పర్ల సాయంతో మట్టిని తరలించే క్రమంలో రహదారులు ఛిద్రమవుతున్నాయనీ, రాత్రిళ్ళు నిద్ర కూడా పట్టడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. చెరువుల్లో మెగా అక్రమ తవ్వకాలు, మట్టి తరలింపుపై గ్రామస్తుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నా ఖాతరు చేయడం లేదని సమాచారం. ప్రశ్నిస్తే మాకు రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల నుంచి అనుమతులున్నాయంటూ గ్రామస్తులపైనే ఎదురుదాడికి దిగుతున్న



పరిస్థితి. విషయం సంబంధిత అధికారులకు తెలిసినా చూసీ చూడనట్లు వదిలేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. కూటమి నేతల అండ పుష్కలంగా ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. చెరువుల్లో మట్టి తవ్వితే అడిగేవారెవరులే అన్న ధీమాతో లోయల్ని తలపించేలా గుంతలు తవ్వేస్తున్న వైనం. ఇలాంటి పరిస్థితుల్లో వర్షాకాలం గుంతల్లో నీరు చేరినప్పుడు లోతు తెలియక అమాయకులు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. పశువులు కూడా మత్యువాత పడే అవకాశం ఉంది. సాధారణంగా చెరువుల్లో మట్టి తవ్వకాలకు అనుమతులిస్తే నిబంధనల ప్రకారం మూడున్నర అడుగులకు మించి లోతులో మట్టి తీయకూడదు. కానీ మెగా యాజమాన్యం మాత్రం తాటిమాను లోతులో గుంతలు తీసేస్తున్నారని గ్రామస్తులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువుల్లో మెగా అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ విషయంపై తొట్టంబేడు తహశీల్దార్ మధుసూదన్ రావును వివరణ కోరగా అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

శ్రీకాళహస్తి అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం


ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి నియోజకవర్గం సమగ్ర అభివృద్ధి చెందే విధంగా నిర్మాణాత్మక సహకారం అందిస్తామని కేంద్ర పౌర విమాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి స్వగ్రామం ఊరందూరు గ్రామానికి కేంద్ర మంత్రి శనివారం విచ్చేశారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు కేంద్రమంత్రి కి ఘన స్వాగతం పలికారు.

ఎమ్మెల్యే బొజ్జల ఇంట్లో ఆతిథ్యం స్వీకరించిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు స్థానిక నాయకులతో సమావేశమై వివిధ అంశాలపై చర్చించారు. అనంతరం రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో శ్రీకాళహస్తి నియోజకవర్గం అన్ని విధాల అభివృద్ధికి బహుముఖ అవకాశం ఉన్న నియోజకవర్గమనీ, దీన్ని సమగ్ర అభివృద్ధి చేసేలా నిర్మాణాత్మక సహకారం అందిస్తామన్నారు. మాజీ మంత్రి బొజ్జల గోపాలకష్ణారెడ్డి తో తన తండ్రి కి వున్న సన్నిహిత సంబంధాలను తాను ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డితో కొనసాగిస్తామని అన్నారు. ఎమ్మెల్యే కోరిక మేరకు ఢిల్లీ నుంచి తిరుపతి ఎయిర్పోర్ట్ కు డైరెక్ట్ కనెక్టివిటీ విమాన సర్విస్ తీసుకొచ్చామని, భవిష్యత్తులో దేశ , విదేశాల్లో నుంచి నేరుగా తిరుపతి ఎయిర్పోర్ట్ కు వచ్చే విధంగా పలు సర్వీసులను తీసుకొస్తామన్నారు. రాష్ట్రంలోని విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి విమానాశ్రయాలను అంతర్జాతీయ ప్రమాణాలతో డైరెక్ట్ కనెక్టివిటీ సర్వీసులను పెంచే విధంగా సమగ్ర ప్రణాళిక అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు విజయకుమార్ నాయుడు, చెంచయ్యనాయుడు, కన్నలి ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రికి ఆహ్వానం

కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడుని ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏటుకూరి గిరిబాబు ఆధ్వర్యంలో ఆ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. రాబోవు రెండు మూడు వారాల్లో తిరుపతి ఎస్ వి వైద్య కళాశాలకు వస్తానని హామీ ఇచ్చారు. యూనియన్ తిరుపతి శాఖ కార్యదర్శి కెసి సుబ్రహ్మణ్యం, అధ్యక్షులు వీర కిరణ్, కోశాధికారి బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.



'బ్రహ్మాండ' నాయకుని బ్రహ్మోత్సవం...!

ప్రజాదృష్టి

ప్రజాశక్తి-తిరుపతి సిటి

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి ఏడాదికి ఒకసారి తొమ్మిది రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలనే బ్రహ్మోత్సవం అంటారు. ఈ బ్రహ్మోత్సవాలు వీక్షించేందుకు దేశ నలుమూలే కాక విదేశాల నుంచి సైతం భక్తులు వస్తుంటారు. ఈ ఉత్సవాల్లో ప్రతి రోజూ స్వామివారు ఉదయం, సాయంత్రం ఒక్కో రకమైన వాహనాల్లో తిరుమాఢవీధుల్లో విహరించి, భక్తులకు దర్శనం ఇస్తారు. కోట్లాది రూపాయలు వెచ్చించి టిటిడి ఈ బ్రహ్మోత్సవాలను అత్యంత ఆడంబరంగా నిర్వహిస్తుంది. బ్రహ్మోత్సవాల్లో విశిష్టమైనది గరుడ సేవ. సాదారణ రోజుల్లో స్వామివారిని లక్ష మంది దర్శించుకుంటే బ్రహ్మోత్సవాల్లో ఆలయం వెలుపల వాహనసేవల్లో విహరించే స్వామివారిని లక్షన్నర పైగా దర్శించుకుంటారు. అందులో గరుడ సేవ అంటే స్థానికులతో కలిసి సుమారు నాలుగైదు లక్షల మంది భక్తులు స్వామివారి దర్శనం కోసం తిరుమలకు చేరుకుంటారు. పెరటాసి మాసం కావడంతో తమిళనాడు నుంచి అధికంగా భక్తులు గోవింద మాలదారణతో వందల కిలోమీటర్లు కాలినడకన తిరుమలకు చేరుకుంటారు. గరుడ సేవ రోజు ఈ తాకిడి మరింత అధికంగా ఉంటుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని గరుడ సేవకు ఒక రోజు ముందే తిరుమలకు ద్విచక్రవాహనాలను, ప్రయివేట్ వాహనాలను నిషేధిస్తారు. అయినా తిరుమల ఘాట్ రోడ్లలో రద్దీ తప్పదు. ప్రతి ఏడాదీ టిటిడి విజిలెన్స్, పోలీసులు కలిసి భద్రత ఏర్పాట్లు పర్యవేక్షిస్తారు. అయినా భక్తులకు తొక్కిసలాటలు తప్పవు. ఉదయం నుంచి ఎండ, వానను సైతం లెక్కచేయకుండా అర్ధరాత్రి వరకు ఆలయ మాఢవీదుల్లో వేచి ఉండే భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేస్తున్నా, పూర్తిస్తాయి సౌకర్యాలు ఉండకపోవడం భక్తులు అసౌకర్యానికి గురవుతుంటారు. వాహన సేవ ముగియగానే ఒక్కసారిగా భక్తులు వెళ్లేందుకు ప్రయత్నించడం మూలంగా కొంత తొక్కిసలాట చోటు చేసుకుంటుంది. గ్యాలరీలో ఉన్న భక్తుల మాట అటుంచితే వాహన సేవ ముందు అధికారులు, ప్రజాప్రతినిదులు, ప్రముఖులు వేల సంఖ్యలో ఉండటం, సిఫార్సుల ద్వారా విఐపి పాసులు అధికంగా పంచుతుండడంతో సాదారణ భక్తులకు స్వామి దర్శనం సక్రమంగా జరగడం లేదు. ఎలాగోలా గ్యాలరీలను దాటుకుని బయటపడిన భక్తులకు బస్సులు దొరకాలంటే అగచాట్లే, ఘాట్ రోడ్లు మొత్తం బస్సుల రద్దీ అధికంగా ఉంటుంది. ఇందుకు ప్రధాన కారణం విఐపిల వాహనాల అధికం కావడమే. ప్రతి ఏడాది గరుడ సేవకు భక్తులు ఇబ్బందులు పడుతున్నా వాటిని పూర్థిస్థాయిలో కట్టడి చేయడంలో అధికారులు కొంత అలసత్వం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఈ ఏడాది జరిగే బ్రహ్మోత్సవాల సందర్భంగా గరుడ సేవ 8వ తేదిన జరగనుంది. ఎప్పటి లాగే టిటిడి అందుకు తగ్గట్టు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ప్రకటించింది. ఎవ్వరికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. పై పెచ్చు టిటిడి పాలకమండలి లేకపోవడంతో కొంత వరకు విఐపిల సిఫార్సుల తగ్గివచ్చని భక్తులు భావిస్తున్నారు. ఈ ఏడాది గరుడసేవ రోజు విఐపిల తాకిడిని తగ్గించి, సామాన్య భక్తులకు స్వామివారిని ఎక్కువ సమయం దర్శించుకునేలా అధికారులు చర్యలు చేపడతారేమో అని భక్తులు భావిస్తున్నారు. అధికారుల తీరు ఎలా ఉండబోతుందో ఈ నెల 8వ తేది రాత్రి వరకు వేచి చూడాల్సిందే.



సూళ్లూరుపేటలో వరల్డ్ స్పేస్ వీక్ ర్యాలీ

ప్రజాశక్తి-సూళ్లూరుపేట

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ అక్టోబర్ 4-10 తేదీల్లో నిర్వహిస్తున్న ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలలో భాగంగా శనివారం సూళ్లూరుపేటలో స్పేస్ వాక్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్థానిక జూనియర్ కళాశాల ఆవరణం నుండి డి.ఓ.ఎస్ కాలనీ వరకు సాగిన స్పేస్ వాక్‌ను షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ జెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థులు,ఇస్రో ఉద్యోగులు ఈ స్పేస్ వాక్‌లో పాల్గొన్నారు. ఆర్ముగం రాజరాజన్ మాట్లాడుతూ ఈ ఏడాది వరల్డ్ స్పేస్ వీక్ సందర్భముగా స్పేస్ అండ్ క్లయిమేట్ చేంజ్ అనే నినాదం పెట్టి ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. వాతావరణం లో వస్తున్న మార్పులు గురించి పౌరులు తీసుకొనవలసిన జాగ్రత్తలను గురించి అందరు తెలుసుకోవాలని విజ్ఞప్తి చేశారు. షార్ కంట్రోలర్ శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

భక్తులకు అన్నప్రసాదం పంపిణీ

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తిరుమల శనివారాలు పెరటాసి మూడవ శనివారం సందర్భంగా సరోజినీ దేవి రోడ్డులోని సీతారామాంజనేయ స్వామి దేవస్థానం నందు స్థానిక భక్తాదులకు, తిరుమలకు నడిచి వెళ్ళు భక్తులకు ఆలయ నిర్వహకులు ఆర్.ఆర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కే.యల్.వర్మ, పంచాయతీరాజ్ డి.ఇ మురళి, రాధాకష్ణ వర్మ, రాజా నరేన్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ లీలామనోహర్ అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సుజాత, పవన్, విష్ణు, మురళి పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ


నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న దాతలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ప్రత్యేక ప్రతిభావంతులను ఆదుకునేందుకు రెడ్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమ దాతలకు కృతజ్ఞతలు తెలుపు కుంటున్నామని ఆంధ్ర మహిళా మండలి గౌరవ అధ్యక్షురాలు డాక్టర్ రోహిణి అన్నారు. ఆమె మాట్లాడుతూ ప్రత్యేక ప్రతిభావంతులు మానసిక ధైర్యం పెంపొందించుకొని చిన్న చిన్న పనుల ద్వారా సంపాదన ప్రారంభించాలని సూచించారు. అందుకు అవసరమైన పూర్తి సహ కారాన్ని తాను అందిస్తానని హామీ ఇచ్చారు. ఇందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ తనుజ, సభ్యులు పాల్గొన్నారు.

'చిరు ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం'

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని వెలుగు కార్యాలయం పరిధిలోని రైతు ఉత్పత్తిదారుల సమైక్య ఆధ్వర్యంలో రైతులకు సజ్జ పంట ప్రదర్శన నిమిత్తం శనివారం నుండి ఎంఈఎల్ స్పెషలిస్ట్ రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం మొత్తం మీద అధిక శాతం మంది రైతులు పోషక ఆహార లోపంతో బాధపడుతున్నారని దీనిని నివారించేందుకుగాను ప్రతి ఒక్కరూ చిరుధాన్యాలు విరివిగా ఉపయోగించాలన్నారు. ముఖ్యంగా రైతులు సజ్జలు, రాగులు, కొర్రలు, జొన్నలు ఇలాంటి పంటలు అధికంగా పండించాలని తెలిపారు. దీనికి అవసరమైన సలహాలు శి, క్షణలు విత్తనాల లభ్యత గురించి వివరించారు. మార్కెటింగు గురించి సలహాలను ఎప్పటికప్పుడు జీవనోపాధుల మిషన్ ద్వారా అందిస్తామని తెలిపారు, భవిష్యత్తులో ఏ ఒక్కరూ పోషకాహార లోపంతో బాధపడకూడదని ఈ సందర్భంగా ఆయన కోరారు రాయలసీమకు ప్రత్యేక నిధులు కేటాయించేలా చూస్తానని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో జిల్లా, ఎఫ్‌పిఓ , ఏపీఎం ద్రాక్షాయణి, మండల ఏపీఎం మునయ్య, సీసీలు వెంకట్ రత్నం, నీరజాక్షి రామాంజనేయులు, ఐసిఆర్‌పి లతోపాటు రైతులు పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంటుపై శిక్షణ


స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణలో పాల్గొన్న విద్యార్థినులు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని ఎంబీఏ విభాగం లో ఫైనల్ విద్యార్థినులకు ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్, నాంది ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహిం చిన స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ శనివారం ముగిసింది. విద్యార్థినిలకు ఒక వారి కెరీర్‌కు అవసరమైన నైపుణ్యాల పెంపొందించడమే ఈ శిక్షణ ముఖ్య ఉద్దేశం అన్నారు. ఈ కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో ఇంటర్వ్యూ టెక్నిక్స్, గ్రూప్ డిస్కషన్స్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌పై ప్రాక్టికల్‌గా విద్యార్థినులతో చేయిస్తామని వెల్లడించారు. విభాగాధిపతి ప్రొఫెసర్ బి విజయలక్ష్మి విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు ఎంబిఏలో స్పాన్సర్డ్ సీట్ల భర్తీకి అడ్మిషన్స్


మహిళల చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జడ్జి అర్చన

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు ఎంబీఏ విభాగంలో స్పాన్సర్డ్ సీట్ల భర్తీకి అడ్మిషన్స్ నిర్వహించనున్నట్లు డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ పి సువర్చలాదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థినులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో అడ్మిషన్స్ కార్యాలయంలో హాజరు కావాలని ఆమె సూచించారు. ఇతర వివరాలకు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఎస్‌పిఎంవివి.ఎసి.ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చునని పేర్కొన్నారు.

మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి: జడ్జి

ప్రజాశక్తి -రామచంద్రపురం (చంద్రగిరి): సమాజంలో మహిళలు నూతన చట్టాల పై అవగాహన పెంపొం దించుకోవాలని తిరుపతి జిల్లా అదనపు జడ్జి అర్చన అన్నారు. శనివారం చంద్రగిరి ఎంపీడీవో కార్యాలయ సమావేశపు మందిరంలో మహిళ న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె ఈ సందర్భంగా మాట్లాడుతూ చట్టాలే మహిళలకు శ్రీ రామ రక్షగా పేర్కొన్నారు. మహిళలపై ఎవరైనా లైంగిక వేధింపులకు గురి చేస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు. నేటి సమాజంలో బాల బాలికలు ఎక్కువ మంది లైంగిక, ఈవ్ టీజింగ్ వేధింపులకు గురవుతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయన్నారు. తల్లిదండ్రులు బాలికలకు భద్రతపై తీసు కోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని కోరారు. ఇంటి వద్ద పిల్లలను సోషల్ మీడియాకు, టిక్ టాక్‌లకు బానిసలు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వరకట్న వేధింపు, పోక్సో అత్యాచారాలపై ఆమె అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శివరాం సుబ్బయ్య, ఎంపీఎం డిసి గంగయ్య, పలువురు న్యాయవాదులు, మహిళా సంఘాల లీడర్లు, మహిళలు పాల్గొన్నారు.

వెంకటగిరి: మహిళలు చట్టాలపై అవగాహన కలిగి వుండాలని జూనియర్ సివిల్ జడ్జి అనూష తెలిపారు. శనివారం మండల న్యాయ సేవా సంఘం ఆధ్వర్యంలో ఐసిడిఎస్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల భద్రత కోసం ఏర్పాటు చేసిన చట్టాలను తెలుసుకొని ప్రతి ఒక్కరికీ తెలపాలన్నారు. చట్టాలను తెలుసుకుంటేనే అధిపత్యం చేసే వారిని అరికట్టవచ్చునని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐ, ఎస్ఐ, సిడిపిఒ షంషాద్‌బేగం, లోకల్‌బాడీ సభ్యులు రాజేష్, అనుపమ పాల్గొన్నారు.

త్రినాథ్‌రెడ్డి బాధ్యతలు స్వీకరణ



ప్రజాశక్తి - సత్యవేడు: సత్యవేడు ఫారెస్టు రేంజర్‌గా త్రినాథ్‌రెడ్డి శు క్రవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక అటవీ శాఖ కార్యాలయంలో ఆయన శనివారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టగానే అన్ని శాఖల్లోనూ అధికారుల బదిలీలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో అటవీ శాఖలో జరిగిన బదిలీల్లో సంద్యాల జిబిఎం ప్రాజెక్టు టైగర్‌లో పనిచేస్తున్న త్రినాథ్ రెడ్డిని సత్యవేడు ఫారెస్ట్ రేంజర్‌గా నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో స్థానిక ఫారెస్ట్ రేంజర్ త్రినాథ్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ ఫారెస్ట్ రేంజర్‌గా పనిచేసిన జయప్రసాదరావును మదనపల్లికి బదిలీ ఆయారు.

నిస్సన్ మ్యాగ్నెట్ కారు ఆవిష్కరణ


నిస్సన్ మ్యాగ్నెట్ కారును ఆవిష్కరిస్తున్న ఎమ్‌డి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: హైటెక్ నిస్సాన్ కంపెనీ నవ కొత్త మోడల్ తో రూపొందించిన మ్యాగ్నెట్ కారును శనివారం మార్కెట్లోకి విడుదల చేసింది. స్థానిక రేణిగుంట రోడ్ లోని ఆ షోరూమ్ వద్ద జరిగిన కార్యక్ర మానికి నిస్సాన్ హైటెక్ మోటార్ కంపెనీ ఎమ్‌డి జగన్నాథరెడ్డి ముఖ్య అతిథిగా హాజర య్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిస్సాన్ మ్యాగ్నెట్ కారు సరికొత్త ఫ్యూచర్‌ను కలిగి ఉందన్నారు. ఇందులో అమర్చిన 1.0 లీటర్ టర్బో పెట్రోల్ ఇంజన్ 98 బిహెచ్‌పి 160 ఎన్ ఎం పార్కులో అందిస్తుందన్నారు. హై స్పీడ్ మాన్యువల్, సివిటి గేర్ బాక్స్, సిక్స్ ఎయిర్ బ్యాగ్స్, ఎలక్ట్రిక్ సిస్టం కంట్రోల్, తదితర సదుపాయాలు కలిగి ఉందన్నారు. దీనిని వినియోగదారులు సద్వి నియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ డైరెక్టర్లు నిరంజన్, భారతి, హోసిమారెడ్డి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం: ప్రొహిబిషన్ సిఐ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ పరిధిలోని పుత్తూరు, నారాయణవనం, వడమాల పేట, రామచంద్రాపురం మండలాల్లో మద్యం దుకాణాల నిర్వహణకు దరఖాస్తు చేసుకోవచ్చని పుత్తూరు ఎక్సైజ్, ప్రొహిబిషన్ సిఐ తెలిపారు. మద్యం దుకాణం లైసెన్సుకు దరఖాస్తు చేయాలనుకున్నవారు ఈ నెల 9 వ తేది సాయంత్రం 5 గంటల లోపు ఆన్ లైన్లో గాని, ఆఫ్ లైన్ లో దరఖాస్తు చేయాలని సూచించారు. ఆఫ్ లైన్ లో దరఖాస్తు చేయాలనుకున్న వారు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి తిరుపతి వారి పేరుపై 2 లక్షల రూపాయలు డిడి తీసి దరఖాస్తును పుత్తూరు ఎక్సైజ్, ప్రొహిబిషన్ స్టేషన్ వద్ద పూర్తి చేసి ఇవ్వాలని పేర్కొన్నారు. లైసెన్స్ ఫీజ్ కింద పుత్తూరు టౌన్‌కు 65, 00,000 రూపాయలు , నారాయణ వనం, వడమాల పేట, రామ చంద్రాపురం మండలాలకు 55,00,000 రూపాయలుగా ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. ఈ నెల 11 వ తేదీ తిరుపతిలోని శిల్పా రామం ఆర్బన్ హాట్ వద్ద లాటరీ ద్వారా ద్రా తీస్తారని పేర్కొన్నారు.

తిరుపతి జిల్లాలో ఐఎఫ్ఎస్ అధికారుల బదిలీలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్ర వ్యాప్తంగా అటవీశాఖకు చెందిన ఐఎఫ్ఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. తిరుపతి జిల్లా సిసిఎఫ్ నాగేశ్వరరావును కేంద్ర కార్యాలయంలో వర్కింగ్ ప్లాన్ సిసిఎఫ్ గా బదిలీ చేశారు. తిరుపతి ఎస్వీ జూ పార్క్ క్యూరేటర్ సెల్వంను తిరుపతి జిల్లా సిసిఎఫ్ గా పూర్తి అదనపు భాధ్యతలు చేపట్టాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో డిఎస్ఓగా పనిచేస్తున్న వివేక్‌ను తిరుపతి డిఎఫ్ఓగా బదిలీ చేశారు. రంపచోడవరం డిఎఫ్ఎగా విధులు నిర్వహిస్తున్న నరేంధిరన్ ను తిరుపతి బయోట్రిమ్ స్టేట్ సిల్వికల్చరిస్ట్‌గా నియామకం చేశారు.

భూకబ్జా నుండి రక్షించండి..

బాధితుడి అభ్యర్థన


డాక్యుమెంట్లు చూపుతున్న బాధితులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): 'తాను పోలీసునని, ఎక్కడికి వెళ్లి ఫిర్యాదు చేసినా ఏమి చెయ్యలేరని బెదిరించి పోలీసు అధికారి సాంబయ్య మా ఇంటిలో సామాన్లు బయటకు వేసి భూ కబ్జాకు పాల్పడ్డాడు.. తమ భూమిని కబ్జా దారుడి నుండి రక్షించండి..' అని వడమాలపేట మండలం ఒబిఆర్ కండ్రిగకు చెందిన కె చాణిక్య వర్మ తండ్రి కె విజయకుమార్ అభ్యర్థించాడు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో శనివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 1983లో తిరుచానూరు గ్రామ లెక్క దాఖలా సర్వే నెంబర్ 260లో అశ్వర్థామ, మనోహర్ నాయుడు వేసిన లే అవుట్‌లో 50 అంకణాల 22వ పాట్లును 2012లో నాన్ రిజిష్టర్డ్ ద్వారా స్వాధీన విక్రయ పత్రం రాసుకున్నామని, తర్వాత 2021లో లలిత కుమారి నుండి డాక్యుమెంట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్నామన్నారు. 2013లో తిరుచానూరు పోలీస్ స్టేషన్లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించే సాంబయ్య తప్పుడు డాక్యుమెంటు సృష్టించి తమకు చెందిన ప్లాటులో తాము బాడుగకు ఉంచిన వారి సామాన్లు బయటకు వేసి దౌర్జన్యంగా భూ కబ్జాకు పాల్పడ్డారన్నారని తెలిపారు. అప్పటి నుంచి సాంబయ్యపై జిల్లా నుండి రాష్ట్ర పోలీసు ఉన్నతాధి కారుల వరకు ఫిర్యాదులు చేసినా న్యాయం జరగలేదన్నారు. తప్పుడు డాక్యుమెంటును సృష్టించారని విచారణలో తేలినా అధికారులు సాంబయ్యపై చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు , డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ స్పందించి తమకు న్యాయం చేయాలని బాధితుడు కోరాడు.

కాంట్రాక్ట్ వర్కర్స్‌ను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలి

- సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్ జయచంద్ర


మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్ జయచంద్ర

ప్రజాశక్తి - క్యాంపస్: వెటర్నరీ యూనివర్సిటీ కాంట్రాక్టు వర్కర్స్‌ను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్ జయచంద్ర డిమాండ్ చేశారు. వెటర్నరీ యూనివర్సిటీ డిటి హాస్టల్ లో కాంట్రాక్ట్ వర్కర్ సమస్యల పరిష్కారంపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆప్కాస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జి చిన్నబాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్ జయచంద్ర, యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జి చిన్నబాబు మాట్లాడుతూ గత 20 సంవత్సరాల నుంచి వెటర్నరీ యూనివర్సిటీ పరిధిలో దాదాపు రాష్ట్రమంతా దాదాపు 500 మంది పనిచేస్తున్నారని, వాళ్లకి సరైన జీతం లేక తీవ్రమైన ఇబ్బందులు గురవుతున్నారు. ఎన్ని సంవత్సరాల నుంచి పని చేస్తున్నా వారికి ఉద్యోగ భద్రత లేకపోవడంతో బతుకు అయోమయంగా ప్రశ్నార్థకంగా మారిందన్నారు. సుప్రీంకోర్టు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని తీర్పు ఇచ్చినప్పటికీ వాటిని ఏ యూనివర్సిటీలు, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, వేతనాలను మాత్రం పెంచడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. యూనివర్సిటీ యాజమాన్యం జోక్యం చేసుకొని వారి న్యాయమైన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో ఆప్కాస్ యూనియన్ రాష్ట్ర నాయకులు బి మునిరాజా, జయ గంగయ్య, వై ధనంజయులు, సుభహాన్, మురళి నాయుడు పాల్గొన్నారు.

'ఇంటింటికీ తపాలా సేవలు'


తపాలా సేవలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : జాబుల బట్వాడాతో పాటు పొదుపు, బీమా రక్షణ కల్పించే దిశగా ప్రతి కుటుంబానికీ తపాలా శాఖ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని పుత్తూరు తపాలా ఇన్‌స్పెక్టర్ సతీష్ పేర్కొన్నారు. శనివారం పుత్తూరు తపాలా కార్యాలయానికి వచ్చిన ఖాతాదారులు, మహిళలకు ఇన్‌స్పెక్టర్ సతీష్, మెయిల్ ఒవర్సీర్లు మురళి, రాహుల్‌లు తపాలా సేవలను వివరించారు. ఈ సందర్భంగా సతీష్ మీడియాతో మాట్లాడుతూ సోమవారం నుండి ఈనెల 11వ తేదీ వరకు వారం రోజుల పాటు తపాలా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వారోత్సవాలలో భాగంగా మంగళవారం గుర్తించిన తపాలా కార్యాల యాలలో ఆధార్ సేవ క్యాంపులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వారోత్సవాల సందర్భం గా తపాలా కార్యాలయా లలో ఖాతాదారులతో, పౌరులతో పొదుపు, బీమా పథకాలపై అవగా హన సమావేశా లను సిబ్బంది నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఇంటి వద్దకే డోర్ స్టెప్ బ్యాంకింగ్ సేవలతో పాటు పొదుపు ఖాతాలకు నెట్ బ్యాంకింగ్, ఏటీఎం సౌకర్యాలను కల్పిస్తున్న తపాలా సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపు నిచ్చారు.

ఉల్లాసంగా..ఉత్సాహంగా.. 'మోహన్ మంత్ర'


క్రీడల పోటీలో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి): మోహన్ బాబు విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న మోహన్ మంత్ర రెండవ రోజు ఉల్లాసంగా..ఉత్సాహంగా కొనసాగింది. మోహన్ మంత్ర ఈవెంట్లో భారీగా విద్యార్థినివిద్యార్థులు పాల్గొన్నారు. మండలంలోని ఏ రంగంపేట సమీపంలో శ్రీ సాయినాథ్ నగర్‌లోని ఎంబీయూలో ప్రతి సంవత్సరం నిర్వహించే మోహన్ మంత్ర కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా హాజరైన ఎంబీయూ ప్రో ఛాన్సలర్ మంచు విష్ణు శనివారం ఉదయం ప్రారంభించారు.. ఈ మోహన్ మంత్రా ఈవెంట్‌లో ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుండి దాదాపు 20 వేల మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు విజ్ఞానం, క్రమశిక్షణ, మానసిక ఉల్లాసాన్ని పెంపొందించుకోవడం కోసం మోహన మంత్ర ఎంతగానో దోహదపడుతుందన్నారు. టెక్ ఎగ్జిబిషన్, త్రీడీ డిఎండి పోటీ, హ్యాకథాన్, క్విజోనా మిక్స్, బ్రిడ్జ్ ఓ మానియా, లాగ్ లేకుండా జెండాను కనుగొనండి, కోడ్ స్ప్రింట్, వర్చువల్ మోడలింగ్, రోబో వార్, బ్రీవిటీ బ్లిట్జ్, స్పెల్ క్వెస్ట్ అండ్ (లెట్స్ నాచో, రాంప్ వాక్, బ్యాండ్ బ్యాటిల్, పిక్చర్ పర్ఫెక్ట్, చికెన్ డిన్నర్, అల్టిమేట్ బ్యాటిల్ (షార్ట్ ఫిల్మ్), సిట్‌కామ్, రీల్ మాస్టర్, స్టాండ్-అప్ టాకీస్, మీమ్ ఛాలెంజ్, గల్లీ క్రికెట్, ట్రెజర్ హంట్, తదితర కార్యక్రమాలలో విద్యార్థులు తమ నైపుణ్యాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంబీయూ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు వినయ్ మహేశ్వరి, ఆచార్య నాగరాజ రామరావ్, చీఫ్ గ్రోత్ అండ్ స్ట్రాటజిక్ ఆఫీసర్స్ వికాస్ సింగ్, రిజిస్ట్రార్ డాక్టరు కె. సారథి, డీన్లు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేలపట్టు పక్షుల కేంద్రం పరిశీలన


నేలపట్టు పక్షుల కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఫారెస్టు అధికారులు

ప్రజాశక్తి -దొరవారిసత్రం: ప్రముఖ విదేశీ పక్షుల పర్యాటక కేంద్రమైన నేలపట్టు పక్షుల కేంద్రాన్ని పులికాట్ వైల్డ్ లైఫ్ నూతన డి ఎఫ్ఓ హారిక శనివారం సందర్శించారు. ఆమె ఈ కేంద్రం అవగాహన నిమిత్తం పూర్తిస్థాయి విస్తీర్ణం చిత్రపటం, చెరువు కట్ట, పక్షుల బ్రీడింగ్ ప్రదేశం, ఈసీ, జింకల, పక్షుల పార్కును పరిశీలించారు. ప్రధాన ముఖ ద్వారం వద్ద టికెట్ కౌంటర్ ప్రవేశ రుసుముల ధరల నిర్ణయ పట్టికను పరిశీలించారు. జింకలకు అవసరమైన ఆహారం చాలినంత అందిస్తున్నారా? లేదా..అనే విషయంపై ఆరా తీశారు. పర్యాటకుల సందర్శనార్థం ఏర్పాటు చేసిన పలు రకాల అందమైన చిన్న పక్షులకు ఏ రకమైన చిరుధాన్యాలు ఎంత మోతాదులో సరఫరా చేస్తున్నారని ప్రశ్నించారు.ఈ ఏడాది పక్షుల రాక సీజన్ మొదలు కానుండడంతో పర్యాటకులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు, సదుపాయాలు సక్రమంగా ఉండేలా చూడాలని సూచించారు. పక్షుల కేంద్రంలోని ప్రతి ప్రాంతాన్ని ఆమె పరిశీలించి తెలుసుకున్నారు. డిఎఫ్ఓ వెంట ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సౌజన్య పాల్గొన్నారు.

చేనేత అభివృద్ధికి కృషి

రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య


గంజి మాధవయ్యను సన్మానిస్తున్న చేనేత కార్మిక సంఘాల నాయకులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : చేనేత అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య పేర్కొన్నారు. చేనేత కార్మిక యూనియన్ తిరుపతి జిల్లా సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్‌ను పుత్తూరులోని ఆయన నివాసంలో చేనేత కార్మిక యూనియన్ నాయకులు , చేనేత కార్మికులు శనివారం కలిసి శుభాకాంక్షలు, అభినం దనలు తెలిపి సన్మానించారు. ఈ సందర్భం గా గంజి మాధవయ్య మాట్లాడుతూ నేటి ప్రభుత్వం, మంత్రి లోకేష్ చేనేత కార్మికులు అధికంగా వున్న మంగళ గిరి నియోజకవర్గాన్ని పూర్తి స్థాయిలో చేనేతల సంక్షేమానికి, అభివృద్ధికి కృషి చేస్తారని పేర్కొన్నారు. తిరుపతి ,చిత్తూరు జిల్లాలోని చేనేత కార్మికుల సంక్షేమానికి, అభివృద్ధికి, వృత్తి సంరక్షణకు కార్పొరేషన్ తొలి సమావేశంలోనే విధులు, నిధులు గురించి తెలుసుకుని చేనేతలకు సహాయ పడతానని హామీ ఇచ్చారు. జిల్లాలో చేనేత కుటుంబాలను కలిసి సమస్యలను తెలుసుకొని, పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం చేనేత కార్మిక యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఆకుల వాసు , గౌరవ అధ్యక్షు లు కెవి కుప్పయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి షణ్ముగ వర్మ మాట్లాడుతూ చేనేతలకు ప్రభుత్వం అన్ని విధాల సహాయ సహకారాలు అందించాలని, చేనేతల సంక్షేమానికి, అభివృద్ధికి, వృత్తి సంరక్షణకు కృషి చేయాలని కోరారు. రాష్ట్రంలో చేనేత లకు సంబంధించిన అన్ని కార్పొరేషన్ల ఛైర్మన్లు, డైరెక్టర్లు నియమితులైన తర్వాత తిరుపతిలో చేనేత సమావేశం ఏర్పాటు చేసి, ప్రభుత్వానికి నివేదిక, పంపి తగు చర్యలు తీసుకోవాలని కోరుతామన్నారు. ఈ కార్యక్రమంలో చేనేత సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శ్రీ రామకృష్ణ చేనేత సొసైటీ అధ్యక్షులు, మాజీ డిసిసిబి డైరెక్టర్ చల్లా బాలాజీ, చిత్తూరు జిల్లా చేనేత కార్మిక యూనియన్ ప్రధాన కార్యదర్శి కందల బాలాజీ, సీనియర్ చేనేత నాయకులు ఎన్ అరుణాచలం, లోకనాథం శెట్టి, మాజీ ఎంపిటిసి గజపతి, తదితర చేనేత నాయకులు కార్మికులు పాల్గొన్నారు

రోడ్డు దుస్థితిని పట్టించుకోండి: సిపిఎం

ప్రజాశక్తి - సత్యవేడు: సత్యవేడు మండలంలోని విఆర్ కండ్రిగ నుండి కన్నావరం మీదుగా నాగలాపురం వెళ్లే రోడ్డును త్వరితగతిన ప్రభుత్వం మరమ్మతులు చేయాలని సత్యవేడు సిపిఎం మండల కార్యదర్శి మెలుగు రమేష్ కార్యకర్తలతో కలిసి కన్నావరం రోడ్డుపై శనివారం బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వెలుగు రమేష్ మాట్లాడుతూ వి ఆర్ కండ్రిగ నుండి కన్నావరం మీదుగా నాగలాపురం వెళ్లే రోడ్డు గుంతల మయమై దుస్థితికి చేరుకొని ప్రజా రవాణాకు ఆటంకంగా తయారైందన్నారు. ప్రభుత్వ రవాణా సంస్థలే ఈ రోడ్డుపై రవాణాను కొనసాగించాలని ఆలోచించే పరిస్థితి నెలకొందని వ్యాఖ్యానించారు. ముఖ్యంగా ఈ ప్రాంతాలలోని గర్భిణులు హాస్పిటల్ కి వెళ్లాలంటే ఆందోళన నెలకొందన్నారు. ఈ ఆరు గ్రామాల ప్రాంతాల నుండి పనులకు వెళ్లే కార్మికులు, వ్యాపారాల నిమిత్తం బయట ప్రాంతాలకు వెళ్లే చిరు వ్యాపారులు,వాహనదారులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు గురవుతూ ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే భయాందోళన చెందుతున్నారని వాపోయారు.ఈ రోడ్డు దుస్థితి పై దానివల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై అనేకమార్లు పత్రిక కథనాలు, అనేక మాధ్యమాలలో ప్రచురించి నప్పటికీ ప్రభుత్వం కానీ, అధికారులు కానీ స్పందించి రోడ్డు వేయకపోవడం బాధాకరమని ఆవేదనను వ్యక్తపరిచారు. గత ప్రభుత్వంలో అక్రమ ఇసుక మట్టి రవాణా వల్ల రోడ్లు ఈ దుస్థితికి చేరుకున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 'మా ప్రభుత్వమే ఈ రోడ్డును నిర్మిస్తామని గొప్పలు చెప్పుకొని అంతంత మాత్రంగా ఉన్న రోడ్డును జేసీలతో తవ్వి రోడ్డును నిర్మించకుండా మరిచిపోవడం వల్ల రోడ్లు మరింత దుస్థితికి చేరుకున్నాయని వ్యాఖ్యానించారు. కొత్త టిడిపి కూటమి ప్రభుత్వం నెలకొని నాలుగు నెలలు అవుతున్నా ఇంతవరకు సత్యవేడు నియోజక వర్గంలోని ప్రధాన సమస్య అయినా రోడ్డు మరమత్తు గాని పున: నిర్మాణం కాని చేయలేదని ప్రజలు పేర్కొంటున్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించకుండానే వందరోజుల కూటమి ప్రభుత్వ పాలన అనే ప్రచార కార్యక్రమంలో ప్రజల వద్దకు ఎలా వెళుతున్నారని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రజలు సమస్యను పరిష్కరించాలని కోరారు.

క్రైం న్యూస్

ఫ్లై ఓవర్ నుంచి దూకి యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ఫ్లై ఓవర్ నుంచి దూకి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం రాత్రి నగరంలో చోటు చేసుకుంది. అలిపిరి పోలీసుల కథనం మేరకు.. సుమారు 25 సంవత్సరాల వయసు ఉన్న ఓ యువకుడు లీలా మహల్ సర్కిల్‌లో కరకంబాడి కపిలతీర్థం వైపు వెళ్లే ఫ్లైఓవర్‌పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న అలిపిరి పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు, మృతుడు గుండు కొట్టుకొని ఉండడంతో తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చిన భక్తుడే ఉంటాడని, ముఖ కవళికలు చూస్తే తమిళనాడు వాసిగా ఉన్నారని పోలీసులు వెల్లడించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రశాంతంగా టెట్ పరీక్ష

ప్రజాశక్తి - తిరుపతి: ఉపాధ్యాయ అర్హత టెట్ పరీక్షలు శనివారం ప్రశాంతంగా సాగింది. ఆన్‌లైన్ విధానంలో రెండు సెషన్లలో నిర్వహించిన పరీక్షల్లో ఉదయం తొమ్మిదిన్నర గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సెషన్-1 నిర్వహించారు. ఈ పరీక్షకు 726 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 649 మంది మాత్రమే హాజరయ్యారు. మిగిలిన 77 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించిన సెషన్ -2 పరీక్షకు 570 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా వారిలో 485 మంది మాత్రమే హాజరయ్యారు. మిగిలిన 85 మంది గైర్హాజయ్యారు. పరీక్షల్లో ఎక్కడా అవకతవకలు, అక్రమాలు జరగకుండా ఫ్లైయింగ్ స్క్వాడ్, జిల్లా పరిశీలకులు, తనిఖీ బృందాలను జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులు తనిఖీ ఏర్పాటు చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శేఖర్ వెల్లడించారు.

శాప్ ఛైర్మన్ రవినాయుడుకు ఘన సన్మానం


శాప్ ఛైర్మన్ రవినాయుడును సన్మానిస్తున్న తెలుగు యువత నేతలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) ఛైర్మన్‌గా నియమితులై అనిమిని రవినాయుడు ప్రమాణ స్వీకారం చేయ నున్న సంద ర్భంగా తెలుగు యువత నేతలు శుభా కాంక్షలు తెలిపా రు. ఈ సందర్భంగా రవి నాయుడును శాలువా, పుష్ప గుచ్ఛాలతో ఘనంగా సత్కరించి అభినందనలను తెలిపారు. అనంతరం తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ప్రసాదాలను రవి నాయుడుకు వారు అందించారు. తిరుచానూరు తెలుగు యువత నాయకులు దిలీప్ రాయల్ మాట్లాడుతూ టిడిపి బలోపేతానికి రవినాయుడు చేసిన కృషిని గుర్తించి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ బాబు శాప్ ఛైర్మన్‌గా నియమించడం అభినందనీయమన్నారు. కష్టించే వారికి టిడిపిలో ఎల్లప్పుడూ చోటు వుంటుందని పేర్కొన్నారు. రవినాయుడును సత్కరించిన వారిలో తిరుపతి పార్లమెంట్ తెలుగు యువత అధ్యక్షులు అక్షింతల కృష్ణ యాదవ్, రాష్ట్ర యువత ప్రధాన కార్యదర్శి కెవికె ప్రసాద్ పాల్గొన్నారు.

ఏర్పేడు ఎంపీడీవోగా సౌభాగ్యం

ప్రజాశక్తి -తిరుపతి డెస్క్: ఎంపీడీవోల బదిలీల కారణంగా వైయస్సార్ కడప జిల్లా నందలూరు నుంచి ఏర్పేడు మండల ఎంపీడీవో గా డాక్టర్ జి సౌభాగ్యం శనివారం బాధితులు స్వీకరించారు. ఏర్పేడు లో పనిచేసిన ఎంపీడీవో ఏ గిడ్డయ్య చిన్నగొట్టిగిల్లు కు బదిలీ అయ్యారు.

ముగిసిన వైద్య విద్యార్థుల క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: ఎస్ వి వైద్య కళాశాలలో గత మూడు రోజులుగా నిర్వహించిన స్టేట్ క్రికెట్ టోర్నమెంట్ శనివారం ఘనంగా ముగిసింది. డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, నేషనల్ మెడికల్ కమిషన్ న్యూఢిల్లీ వారి ఆదేశాలతో ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి ఏ చంద్రశేఖరన్ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ క్రికెట్ టోర్నమెంటు ఆఖరి రోజు హోరాహోరీగా సాగింది. నారాయణ వైద్య కళాశాల నెల్లూరు, జేమ్స్ వైద్య కళాశాల శ్రీకాకుళం ఫైనల్స్ లో నిలవగా నారాయణ వైద్య కళాశాల పీజీ వైద్య విద్యార్థులు విజేతలుగా నిలిచారు. మ్యాన్ ఆఫ్ ది టోర్నమెంట్ గా ఎన్ఆర్ఐ వైద్య కళాశాల, చిన్న కాకాని, గుంటూరు, పీజీ వైద్య విద్యార్థి డాక్టర్ వినీత్ అవార్డులను అందుకున్నారు. ఫైనల్ లో విజేతగా నిలిచి క్రికెట్ కప్ సాధించిన నారాయణ వైద్య కళాశాల పీజీ వైద్య విద్యార్థులు వారి కేరింతలతో ఆనందాన్ని వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ తులసీరామ్, డాక్టర్ పాహీం, పూర్వ వైద్య విద్యార్థులు డాక్టర్ మదన్మోహన్ రెడ్డి, డాక్టర్ సుజిత్, డాక్టర్ వినోద్, డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ త్రిమూర్తులు, ఎస్వీ వైద్య కళాశాల ఫిజికల్ డైరెక్టర్ శరవనన్ పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

ప్రజాశక్తి -రామచంద్రపురం (చంద్రగిరి): భక్తులకు దాతల సాయంతో శనివారం అన్నదానం చేశామని చంద్రగిరి మండలం కూచివారిపల్లికి చెందిన పాలగుడి శ్రీనివాసులు నాయుడు అన్నారు. ఆయన 12 సంవత్సరాల క్రితం గోవింద సేవా మండలి సంస్థను స్థాపించారు. నాటి నుంచి ఆ సంస్థ ద్వారా శ్రీవారి బ్రహ్మోత్సవాలు నిర్వహించే తొమ్మిది రోజుల పాటు శ్రీవారి మెట్టు మార్గంలో కాలి నడకన తిరుమలకు వెళ్లే భక్తులకు నిర్విరామంగా రుచికరమైన ఆహారాన్ని పంపిణీ చేస్తున్నారు. చంద్రగిరి మండలం లోని భీమవరం, పుల్లయ్యగారి పల్లి, కొటాల నారావారిపల్లి తదితర గ్రామాలకు చెందిన రైతులందరూ స్వచ్ఛందంగా అందించే బియ్యం, పప్పు, కూరగాయలు, వంటనూనె, వేరుశనగ పప్పులు వంటి వాటితో ఉదయం అల్పాహారం నుంచి సాయంత్రం వరకు నిరంతరం అన్నదానం చేస్తూ సేవలో తరిస్తున్నారు.

సిద్దేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్: ఏర్పేడు మండలంలోని చిందేపల్లిలోని సిద్ధేశ్వరాలయంలో శరన్నవ రాత్రి ఉత్సవాలు సందర్భంగా మూడవరోజు ద్రాక్షాయని, పార్వతి దేవి, గాయత్రి రూపంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్త గంగలపూడి గిరిధర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించారు. చుట్టుపక్కల పరిసర భక్తులు ఆలయానికి విచ్చేసి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.